بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ      نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ      وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 23.08.2019 (Telugu)**

## ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప బద్రి అనుచరులైన హజ్రత్ ఖతాదహ్ బిన్ నుʼమాన్ అన్సారి, హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మజ్వూన్ రజియల్లాహు అన్‌హుమా సద్గుణముల విశ్వాసభరిత ప్రస్తావన

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 23.08.2019 తేదీన - మస్‌జిద్ ముబారక్, ఇస్లామాబాద్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. బద్రి అనుచరుల ప్రస్తావనలో భాగంగా నేడు కూడ నేను బద్రి అనుచరుల గురించి ప్రస్తావింతును. వారిలో మొదటి పేరు హజ్రత్ ఆసిమ్ బిన్ అదీ రజియల్లాహు తఆలా అన్‌హు. హజ్రత్ ఆసిమ్ ముయిన్ బిన్ అదీ సోదరులు. మధ్య ఎత్తు గలవారు. తలకు మైదాకు పెట్టుకునేవారు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం బదర్ వైపు బయలు దేరేటప్పుడు వారు సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ఆసిమ్ బిన్ అదీని మదీనాలోని ఎగువ ప్రాంతమైన ఖుబాకు అమీర్ గా నియమించిరి. మరో కథనములో ఇట్లు గలదు. రౌహ ప్రాంతము నుండి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ఆసిమ్ బిన్ అదీని మదీనాలోని ఎగువ ప్రాంతమైన ఖుబాకు అమీర్‌గా నియమించి తిరిగి పంపిరి. కాని వారు సల్లం వారిని బద్రి అనుచరులలో పరిగణించిరి. వారి కొరకు యుద్ధములో లభించిన శత్రువు సామాగ్రిలో భాగము సైతం కేటాయించిరి.

హజ్రత్ ఆసిమ్ ఉహద్, ఖందక్‌తో ఇతర యుద్ధములన్నిటిలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి పాల్గొనిరి. హజ్రత్ ఆసిమ్ హిజ్రి 45వ సం॥లో హజ్రత్ ముఆవియా ప్రభుత్వ హయాంలో మృతి చెందిరి. అప్పుడు వారి వయసు 115 సం॥లు యుండెను. 120 సం॥ల వయసులో వారు మృతి చెందిరని మరికొందరంటారు.

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం తబూక్ యుద్ధము కొరకు సన్నద్ధము కావాలని అనుచరులను ఆదేశించినప్పుడు దైవ మార్గములో ధనము, సవారీలను అందించాలని ధనికులకు పిలుపునిచ్చిరి. కావున వివిధ అనుచరులు తమ తమ స్థోమత ప్రకారము త్యాగము చేసిరి. ఇదే సందర్భములో హజ్రత్ అబూబకర్ తమ గృహములోని ధనమును మొత్తం అనగా నాలుగు వేల దిర్‌హమ్‌లను అందించిరి. తమ కుటుంబ సభ్యుల కొరకు ఏమైనా వుంచినావా లేదా? అని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అబూబకర్‌ను ప్రశ్నించిరి. కుటుంబ సభ్యుల కొరకు అల్లాహ్, అతని ప్రవక్తను విడిచి వచ్చానని వారు సమాధానమిచ్చిరి. హజ్రత్ ఉమర్ తమ గృహములోని అర్థ ధనమును అందించిరి. ఈ సందర్భమున హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ ఒక వంద ఓఖియా ఇచ్చిరి. ఒక ఓఖియా 40 దిర్‌హమ్‌లకు సమానం. అప్పుడు వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ పృథ్వీపై దైవ నిధులలోని నిధులు. వారు అల్లాహ్ ప్రీతి కొరకు ఖర్చు చేస్తారు. ఈ సందర్భమున స్త్రీలు కూడ తమ ఆభరణములను అందించిరి. ఇదే సందర్భమున ఇప్పుడు ప్రస్తావించుచున్న హజ్రత్ ఆసిమ్ బిన్ అది 70 వస్‌ఖ్ ఖర్జూరములను అందించిరి. ఒక వస్‌ఖ్‌లో 60 సాలుంటాయి. ఒక సాలో రెండున్నర షేర్లుంటాయి. ఈ రకంగా ఖర్జూరముల మొత్తం తూకం 262 మన్‌లు అగును. ఒక మన్‌లో సుమారు 40 కిలో గ్రాములుంటాయి. సారాంశమేమనగా హజ్రత్ ఆసిమ్ బిన్ అది ఈ సందర్భమున తమ వద్ద నున్న ఖర్జూరములను చాలా ఎక్కువ మోతాదులో అందించిరి.

మస్‌జిదె జిరార్‌ను నేల మట్టం చేయాలని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిన అనుచరులలో హజ్రత్ ఆసిమ్ బిన్ అది కూడ వుండిరి. మస్‌జిదె జిరార్ వద్దకు వెళ్లి దానిని నేల మట్టం చేయాలని అనుచరులను ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిరి. మస్‌జిద్ కూలగొట్టి దహనం చేయబడినప్పుడు ఆ మస్‌జిద్‌ను నిర్మించిన వారు అక్కడే వుండిరి. కాని దహనమగుచున్న విషయమును చూచి వారు అక్కడి నుండి పారి పోయిరి. నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఆ మస్‌జిద్ స్థలమును ఆసిమ్ బిన్ అదీకి అక్కడ వారు గృహము నిర్మించుకొనుటకు ఇవ్వదలచిరి. కాని ఆసిమ్ బిన్ అదీ ఇట్లు వేడుకొనిరి. నాకు ఇల్లున్నది, ఈ విషయము నాకు నచ్చుడం కూడ లేదు. సాబిత్ బిన్ అక్రమ్‌కు గృహము లేదు. కావున వారిక్కడ గృహము నిర్మించుకొనుటకు

వారికివ్వడం ఉత్తమమగును. కావున రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఈ స్థలమును సాబిత్ బిన్ అక్రమ్ నకు ఇచ్చిరి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఒక సారి ఢిల్లీ ప్రయాణించినప్పుడు ఢిల్లీలోని జామి మస్జిద్‌ను సందర్శించి ఇట్లనిరి. చాలా అందమైన మస్జిద్. కాని మస్జిదుల అసలు అందము భవనముతో కాదు అతి వినయముతో నమాజ్ సలుపే ప్రజలతో ఏర్పడును. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హయాంలో ప్రాపంచికులు ఒక మస్జిద్ నిర్మించిరి. కాని అది అల్లాహ్ తఆలా ఆదేశముతో నేలమట్టం చేయబడెను. నిస్వార్థపరతతో మస్జిదులు నిర్మించబడవలెననే ఆదేశము గలదు.

**లిమన్ హారబల్లాహ** విశ్లేషణలో హజ్రత్ ఖలీఫా అవ్వల్ (రజి) ఇట్లనిరి. క్రైస్తవుడైన అబూఆమిర్ గురించి ఇందులో సమాచారము గలదు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ మస్జిద్‌లో నమాజ్ చదవినచో అనంతరం కొందరు ముస్లిములు అక్కడికి వచ్చిపోవుదురు. తద్వారా ముస్లిములలో విభేదములు సృష్టింతునని అతను పన్నిన కుట్రలలో ఒకటుండెను.

ప్రస్తావించనున్న రెండవ అనుచరుని పేరు హజ్రత్ అమర్ బిన్ ఔఫ్. వీరు మక్కాలో జన్మించిరి. కాని వీరు యెమెన్‌కు చెందినవారని ఇబ్నె సాద్ తెలిపిరి. ఆరంభములోనే ఇస్లాం స్వీకరించిన వారిలో హజ్రత్ అమర్ బిన్ ఔఫ్ ఒకరు. హజ్రత్ అమర్ బిన్ ఔఫ్ మదీనాకు ప్రస్థానము చేసినప్పుడు ఖుబాలో హజ్రత్ కుల్సూమ్ బనిల్‌హదమ్ వద్ద నివాసముండిరి. హజ్రత్ అమర్ బిన్ ఔఫ్ బదర్, ఉహద్, ఖందక్ యుద్ధములతో పాటు ఇతర యుద్ధములన్నిటిలో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి పాల్గొనిరి. హజ్రత్ ఉమర్ ఖిలాఫత్ మాయాంలో హజ్రత్ అమర్ బిన్ ఔఫ్ మృతి చెందిరి. వారి జనాజ నమాజ్ హజ్రత్ ఉమర్ చదివించిరి.

ప్రస్తావించబడనున్న మరో అనుచరుని పేరు హజ్రత్ ముయిన్ బిన్ అది. వీరు అన్సార్ తెగ బనూ అమర్ బిన్ ఔఫ్ ప్రతిపక్షము. హజ్రత్ ముయిన్ 70 అనుచరులతో కలిసి బైఅతె అఖబాలో పాల్గొనిరి. ఇస్లాం స్వీకరించక ముందే వీరికి అరబ్బీలో వ్రాయడం వచ్చేది. హజ్రత్ ముయిన్ బదర్, ఉహద్, ఖందక్ యుద్ధములతో పాటు ఇతర యుద్ధములన్నిటిలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి పాల్గొనిరి.

హజ్రత్ ఉమర్ (రజి) ఇట్లనిరి. నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అస్తమించినప్పుడు మీరు మాతో కలిసి మన సోదరులైన అన్సార్ వద్దకు రాగలరని నేను హజ్రత్ అబూబకర్‌తో చెప్పితిని. మేమక్కడికి చేరుకొంటిమి. వారిలోని బద్రి అనుచరులైన ఇద్దరు మంచి వ్యక్తులు మాకు కలిసిరి. నేను ఉర్వ బిన్ జుబైర్‌తో ప్రస్తావించగా హజ్రత్ ఉవైమ్ బిన్ సాయిదహ్, హజ్రత్ ముయిన్ బిన అదీ అని వారు తెలిపిరి. ఈ సంఘటనను వివరించుచు హుజూరె అన్వర్ ఇట్లనిరి.

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఇట్లనిరి. ఒక సారి మినాలో వున్న హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ గృహములో నేను వుంటిని. అప్పుడు వారు ఉమర్ బిన్ ఖత్తాబ్ వద్దకు వెళ్లిరి. అబ్దుర్రహ్మాన్ నా వద్దకు తిరిగి వచ్చినప్పుడు వారిట్లనిరి. నేడు అమీరుల్ మూమినీన్ వద్దకు వచ్చిన వ్యక్తిని నువ్వు కూడ చూస్తే బాగుండేది. ఆ వ్యక్తి ఇట్లనెను. ఓ అమీరుల్ మూమినీన్! మీకు ఇట్లు మాట్లాడుచున్న వ్యక్తి గురించి తెలిసినదా! అతడిట్లు అంటున్నాడు. 'ఉమర్ మృతి చెందిన తర్వాత నేను ఫలానా వ్యక్తి బైఅత్ చేస్తాను. అల్లాహ్ ప్రమాణము! అబూబకర్ బైఅత్ హడావిడిలో చేయబడెను.' ఇది విని హజ్రత్ ఉమర్ (రజి)నకు బాధ కలిగెను. అనంతరం వారిట్లనిరి. అల్లాహ్ కోరినచో .......... ప్రజల సమస్యలను బలవంతముగా తమ చేతుల్లోకి తీసుకుంటున్న వారి గురించి చైతన్య పరచుటకు నేను ప్రజలనుద్దేశించి మాట్లాడుతాను. అనంతరం ఒక రోజు హజ్రత్ ఉమర్ (రజి) వేదికపై కూర్చొనిరి. అజాన్ తర్వాత నిలబడి అల్లాహ్‌ను తగిన పద్ధతిలో ప్రశంసించిరి. అనంతరం ఇట్లనిరి. నేను నిర్ణయించుకున్న ఒక విషయము మీకు చెప్పదలచితిని. అనంతరం హజ్రత్ ఉమర్ (రజి) ఇట్లనిరి. హజ్రత్ అబూబకర్‌కు ఖిలాఫత్ అర్హత లేకున్నా లభించినదని అంటున్న వ్యక్తి గురించి నాకు తెలిసినది. అతడు నా గురించి ఇట్లనెను. అల్లాహ్ ప్రమాణము! ఉమర్ మృతి చెందినచో నేను ఫలానా వ్యక్తి బైఅత్ చేయుదును. కావున ఎవరు మోసపోకూడదని హజ్రత్ ఉమర్ (రజి) హెచ్చరించిరి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. నేనీ విషయమును మరింత వివరింతును. వారిట్లనిరి. అబూబకర్ బైఅత్ హడావిడిలో అయినదని ఎవరు భావించకూడదు. ఆ బైఅత్ అలాగే అయిన విషయము వాస్తవమే. కాని ఆ హడావిడి బైఅత్ నష్టము నుండి అల్లాహ్ తఆలా రక్షించెను. అబూబకర్ స్థాయి గల వ్యక్తి మీలో ఎవరు లేరు.

అనంతరం ఇట్లనిరి. ముస్లిముల సలహా లేనిదే ఎవరి బైఅత్ చేయకూడదు. బైఅత్ చేసిన వ్యక్తి బైఅత్ కూడ చేయకూడదు. అనంతరం హజ్రత్ ఉమర్ ఇట్లనిరి. అల్లాహ్ తఆలా నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు మరణమిచ్చినప్పుడు అన్సార్ మాకు వ్యతిరేకంగా నిలబడిరి. మేమందరము కలిసి సఖీఫా బనూ సాయిదహ్‌లో అబూబకర్ వద్దకు చేరుకొంటిమి. రండి మనము మన అన్సార్ సోదరుల వద్దకు వెళుదామని అబూబకర్‌ను కోరితిమి. మేము వారికి సమీపములో చేరినప్పుడు మాకు ఇద్దరు మంచి వ్యక్తులు కలిసిరి. వారిలో ఒకరు హజ్రత్ ముయిన్ బిన్ అది కూడ యుండిరి. ఓ వలసదారుల సమూహము! మీరెక్కడికి వెళ్లదలచిరి? అని వారనిరి. మేము అన్సార్ సోదరుల వద్దకు వెళ్లుచున్నామని నేను బదులిచ్చితిని. తస్మాత్ జాగ్రత్త! మీరక్కడికి వెళ్లకండి. మీరిద్దరు కలిసి సలహా చేసుకోండని వారనిరి. నేనిట్లు తెలిపితినని హజ్రత్ ఉమర్ అనిరి. అల్లాహ్ ప్రమాణము! మేము తప్పక వారి వద్దకు వెళ్లుతాము. ఇలా చెప్పి బయలు దేరిరి. బనూ సాయిదహ్ గుడారమునకు చేరుకొనిరి. ఖిలాఫత్ ఎన్నికల గురించి అన్సార్‌తో హజ్రత్ అబూబకర్, హజ్రత్ ఉమర్ సుదీర్ఘ చర్చ జరిపిరి. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) దీని  గురించి వివరించిన వివరణమును తెలుపుతాను. వారిట్లనిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అస్తమించినప్పుడు అనుచరులు మూడు వర్గములలో చీలిపోయిరి. ప్రవక్త అభీష్టము వారి కుటుంబ సభ్యులకే మంచిగా తెలుసు. కావున వారి కుటుంబములోని వ్యక్తిని నియమించవలెనని ఒక వర్గము వాదించెను.

రెండవ వర్గము ఇట్లు భావించెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కుటుంబ సభ్యుల వ్యక్తి కావడం ముఖ్యము కాదు. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఉత్తరాధికారి నిలబడడం ముఖ్యము. ఈ రెండవ వర్గములో రెండు రకాల వర్గములుండెను. ఒక వర్గము ఇట్లు అభిప్రాయపడెను. వారి (సల్లం) సహవాసములో అధికంగా వున్న వారు అనగా ఖురైషీలైన ముహాజిర్లు. వీరి మాటను అరబ్ మొత్తం వినుటకు సిద్ధముండును. మరికొందరు ఇట్లు భావించిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాలో అస్తమించిరి. మదీనాలో అన్సార్ వున్నందున వారే ఈ పనిని మంచిగా చేయగలరు. వారిట్లు వ్రాసిరి. ఈ భేదాభిప్రాయము గురించి ఇంకా కొందరు మాట్లాడుచుండగా అనగా ఇంకా ఒక నిర్ణయమునకు రాక ముందే అన్సార్ పక్షమున వున్న రెండవ వర్గము బనీ సాయిదహ్ వరండాలో గుమికూడి నుఖబా (పర్య వేక్షకుల)లో ఒకరైన ఖజ్‌రజ్ నాయకుడైన సాద్ బిన్ ఉబాదహ్‌ను ఖలీఫాగా ఎన్నుకోవాలని సలహా తీసుకోవడం మొదలు పెట్టిరి. ఈ సలహా గురించి ముహాజిర్లకు సమాచారమందగా వారు కూడ వేగంగా అక్కడికి చేరుకొనిరి. ముహాజిర్లలోని వ్యక్తి ఖలీఫా కానిచో అరబ్బులు అతని విధేయత వహించరు, కేవలం మదీనా విషయము కాదు మొత్తం అరబ్ విషయమని వారు భావించిరి. ఈ సందర్భమున ప్రసంగించుటకు నేను ఒక పెద్ద ఉపన్యాసమును ఆలోచించుకొంటిని హజ్రత్ ఉమర్ తెలిపిరి. అక్కడికి చేరుకోగానే నేను చేసే ఉపన్యాసముతో అన్సార్ అందరు ఏకీభవిస్తారని నేను భావించితిని. కాని మేము అక్కడికి చేరుకోగానే హజ్రత్ అబూబకర్ ఉపన్యాసము చేయుటకు నిలబడిరి. కాని అల్లాహ్ ప్రమాణము! నేను ఆలోచించిన విషయలమున్నిటిని వారు తెలిపిరి. అంతే గాక తమ వద్ద నుండి చాలా నిదర్శనములు ప్రస్తావించిరి. నేను అబూబకర్‌కు పోటీగా నిలువలేనని అప్పుడు భావించితిని. ***అల్ అయిమ్మతు మినల్ ఖురైష్*** అను హదీస్‌ను కూడ హజ్రత్ అబూబకర్ ప్రస్తావించిరి. బదులుగా హబ్బాబ్ బిన్ మున్జిర్ ఖజ్‌రజీ వ్యతిరేకించి, ఇట్లనెను. ముహాజర్లలో నుండి ఖలీఫా అగుటను మేము అంగీకరించము. మీరు ఏ విధంగాను నమ్మనిచో, మీరు పట్టుబట్టినచో ఒక అమీర్ మీలో నుండి మరొక అమీర్ మా లో నుండి వుండవలెను. హజ్రత్ ఉమర్ ఇట్లనిరి. మంచిగా ఆలోచించి మాట్లాడు. ఏక కాలంలో ఇద్దరు అమీర్లు వుండుట మంచిది కాదని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పిన విషయము నీకు గుర్తు లేదా.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. కొంత సమయము వరకు చర్చ కొనసాగిన తర్వాత హజ్రత్ అబూఉబైదహ్ నిలబడి ఇట్లనుచు అన్సార్‌నకు ఇట్లు నచ్చచెప్పిరి. మక్కా బయట విశ్వసించిన మొదటి జాతి మీరే. కావున రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం పరమపదించిన తర్వాత ధర్మ ఉద్దేశమును మార్చివేసిన మొదటి జాతిగా మీరు మారకండి. వారిలా చెప్పగానే ప్రజలు ప్రభావితమైరి. బషీర్ బిన్ సాద్ ఖజ్‌రజీ నిలబడి తమ జాతితో ఇట్లనిరి. వీరు నిజమే చెప్పుచున్నారు. మనము ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సేవ చేసినాము. ఏదో ప్రాపంచిక కోరికతో మనము వారికి సహాయము అందించలేదు. వారి తర్వాత మనకు ప్రభుత్వము లభించాలని కూడ చేయలేదు. ఇదంతా మనము అల్లాహ్ తఆలా ప్రీతి కొరకు చేశాము. దీని తర్వాత మరో అర గంట లేదా

ముప్పావు గంట చర్చ జరిగినది. అనంతరం ముహాజిర్లలోని ఒకరి బైఅత్ చేయాలని అందరు ఒక నిర్ణయానికి వచ్చిరి. ఈ పదవికి హజ్రత్ ఉమర్, హజ్రత్ ఉబైదహ్ పేర్లను హజ్రత్ అబూబకర్ సూచించిరి. కాని ఇద్దరు నిరాకరించి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం తన అనారోగ్య రోజులలో ఎవరిని నమాజ్ కొరకు ఇమామ్‌గా నియమించిరో, ముహాజిర్లలో ఉత్తముడైన వ్యక్తి బైఅత్ మేము చేస్తామని వేడుకొనిరి.

ఇలా హజ్రత్ అబూబకర్ బైఅత్ మొదలైనది. మొదట హజ్రత్ ఉమర్ బైఅత్ చేయగా తర్వాత హజ్రత్ ఉబైదహ్ బైఅత్ చేసిరి. అనంతరం బషీర్ బిన్ సాద్ ఖజ్‌రజీ బైఅత్ చేసిరి. ఇలా ఔస్, ఖజ్‌రజ్ ప్రజలు, ఇతరులు కలిసి సాద్, హజ్రత్ అలీ మినహా కొద్ది సమయములోనే అందరు బైఅత్ చేసిరి. హజ్రత్ అలీ కొన్ని రోజుల తర్వాత బైఅత్ చేసిరి. కొన్ని కథనములలో 3 రోజుల తర్వాత, మరి కొన్ని కథనములలో 6 మాసాల తర్వాత అనే ప్రస్తావన గలదు. ఆరు నెలల కథనములో ఇట్లు కూడ చర్చ గలదు. హజ్రత్ ఫాతిమా ఆనారోగ్య కారణముల వలన వారు హజ్రత్ అబూబకర్ బైఅత్ చేయలేక పోయిరి. బైఅత్ చేయుటకు వారు వచ్చినప్పుడు ఫాతిమా అనారోగ్యము వలన నాకు ఆలస్యమైనదని వారు క్షమాపణ కూడ కోరిరి.

హజ్రత్ ఉర్వ బిన్ జుబైర్ ఇట్లనిరి. అల్లాహ్ తఆలా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు మరణమిచ్చినప్పుడు ప్రజలు వారు సల్లల్లాహు అలైహి వసల్లం గురించి చాలా రోధించిరి. ప్రజలు ఇట్లనే వారు. అల్లాహ్ ప్రమాణము! మేము వారి సల్లల్లాహు అలైహి వసల్లం కంటే ముందు మరణించినచో బాగుండును. వారు సల్లల్లాహు అలైహి వసల్లం తర్వాత మేము ఏదో మోసమునకు గురగుతామని మాకు భయముండెను. అప్పుడు హజ్రత్ ముయిన్ ఇట్లనిరి. అల్లాహ్ ప్రమాణము! వారు సల్లల్లాహు అలైహి వసల్లం కంటే ముందు మరణించాలని నేను భావించలేదు. ఎందుకనగా వారు సల్లల్లాహు అలైహి వసల్లంను వారి జీవితములో విశ్వసించినట్లే వారు సల్లల్లాహు అలైహి వసల్లం అస్తమించిన తర్వాత కూడ విశ్వసించాలని, ఖిలాఫతె రాషిదహ్ గురించి వారు సల్లల్లాహు అలైహి వసల్లం చేసిన భవిష్యవాణి ప్రకారము ఏర్పడే ఖిలాఫత్‌ను ధృవీకరించాలని, దానిని కొనసాగించాలని, దాంబికుల, ధర్మభ్రష్టుల కుట్రలకు బలి కాకూడదని నేను భావించేవాడిని.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇటువంటి విశ్వాస ప్రమాణమును ప్రతి అహ్మది తమలో ఏర్పరచుకోవలెను. ఒక కథణము ప్రకారము నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అస్తమించిన తర్వాత హజ్రత్ ముయిన్ హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్‌తో కలిసి ధర్మభ్రష్టుల, తిరుగుబాటు దారుల దండనలో పాల్గొనిరి. హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ నాయకత్వములో రెండు వందల సైనికుల వెంట హజ్రత్ ముయిన్‌ను యమామ వైపు ముందస్తు సైన్యముగా పంపిరి. హజ్రత్ ముయిన్‌ను హజ్రత్ జైద్ బిన్ ఖత్తాబ్‌నకు సోదరులుగా ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం చేసిరి. ఈ ఇద్దరు అనుచరులు హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ ఖిలాఫత్ హయాంలో హిజ్రి 12వ సం॥లో సంభవించిన యమామ యుద్ధములో అమరులైరి.

ప్రవక్తృత్వ స్థానమును గుర్తించు అనుగ్రహము, ఖిలాఫత్ పట్ల వినయ, విధేయతలతో కూడిన సంబంధము ఏర్పరచుకొను అనుగ్రహము అల్లాహ్ తఆలా ప్రతి అహ్మదీకి ప్రసాదించుగాక!

☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

| From, | To, |
| --- | --- |
| ............................................ | ............................................ |
| ............................................ | ............................................ |
| ............................................ | ............................................ |
| ............................................ | ............................................ |